క్లుప్తంగా

త్రెడ్ ఆర్ట్ చిత్రం బహూకరణ



త్రెడ్ ఆర్ట్ చిత్రాన్ని కలెక్టర్ నివాస్‌కు అందజేస్తున్న రాజు తదితరులు

కాకినాడ సిటీ: ఏడిదకు చెందిన పైడిమల రాజు కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్ చిత్రాన్ని ఫ్లైవుడ్ బోర్డుపై చుట్టూ గుండ్రంగా మేకులను కొట్టి దానిపై నల్లని దారంతో (త్రెడ్ ఆర్ట్) చిత్రాన్ని తయారు చేశారు. దానిని గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నివాస్‌కు అభిమాన పూర్వకంగా అందజేశారు. తాను ప్రస్తుతం డిప్లమో ఇన్ ఫైన్ ఆర్ట్స్, డ్రాయింగ్ టీటీసీ చేస్తున్నానని, ఈ చిత్రం తయారీకి బచ్చు రామం మున్సిపల్ కార్పొరేషన్ గర్ల్స్ హైస్కూల్, జగన్నాథపురం, కాకినాడలో పని చేస్తున్న టీటీసీ ఇన్‌స్ట్రక్టర్, చిత్ర లేఖనోపాధ్యాయుడు మొగిలిసీడి రాధాకృష్ణ సహకారం అందించారని రాజు తెలిపారు. ఈ చిత్రాన్ని అద్భుతంగా తయారు చేసిన పైడిమల రాజు, రాధాకృష్ణలను కలెక్టర్ అభినందించారు.

శ్రమదానంతో పిచ్చిమొక్కల తొలగింపు



కరపలో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగిస్తున్న వాకర్స్

కరప: స్థానిక రక్షిత నీటి చెరువు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్‌లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇక్కడ నడకకు ఇబ్బందిగా మారింది. విషసర్పాలు తిరుగుతుండటంతో ఉదయం 5 గంటలకు వాకింగ్‌కు వెళ్లే వాకర్స్ భయాందోళన చెందుతున్నారు. నడక దారిలో పెరిగిన పిచ్చిమొక్కలు, తుప్పలను తొలగించాలని వారు ఉపాధి హామీ పథకం అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గురువారం వాకర్స్ శ్రమదానం చేసి కొంతమేర పిచ్చిమొక్కలను తొలగించారు. రోజూ కొంతమేర పిచ్చిమొక్కలు తొలగిస్తామని వారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉప్పలంకలో 'నేను బడికి పోతా'

కాకినాడ సిటీ: కరప మండలం ఉప్పలంకలో గురువారం ఎంఈఓలు బులి కృష్ణవేణి, పి.సత్యనారాయణల ఆధ్వర్యంలో నేను బడికి పోతా, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, కాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా విధానాలపై వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, మంచి విద్యను అందిస్తున్నారన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, బడి ఈడు పిల్లలను గుర్తిస్తామన్నారు. ఉప్పలంక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై ఆందోళన

కాకినాడ క్రైం: స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవం అనంతరం తల్లి, శిశువు మరణాలపై వివాదం నెలకొంది. కొవ్వాడకు చెందిన ఓ గర్భిణి గురువారం తొలుత జీజీహెచ్‌లో ప్రసవానికి చేరింది. అక్కడి వైద్యులు ఉమ్మనీరు పోవడంతో గర్భిణి ప్రాణాంతక స్థితిలో ఉందని తెలిపారు. కుటుంబ సభ్యులు స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ప్రసవానంతరం మాతాశిశు మరణాలు సంభవించాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తల్లి, బిడ్డ మృతి చెందారని ఆరోపించారు.

వేట వలనే ఆనందం

- గంగపుత్రులకు మత్స్య సిరులు
- చేపల వేటలో బిజీబిజీ

కాకినాడ రూరల్: సంద్రం సిరులు కురిపిస్తోంది.. మత్స్యకారుల వలకు చేప చిక్కుతోంది.. ఉత్సాహంగా వేటకు వెళ్లిన వారి మోములో ఆనందం వెల్లివిరుస్తోంది.. సుమారు రెండు నెలల పాటు చేపల వేట నిషేధం అమలులో ఉండడంతో ఉపాధి లేకుండా గడిపిన గంగపుత్రులు ఇప్పుడు ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో బోట్లపై సముద్ర జలాల్లోకి వెళ్లి చేపలు వేట సాగిస్తున్నారు. ప్రస్తుతం అధిక సంఖ్యలో చేపలు పడడంతో సిరులు పంట పండుతోంది. విలువైన చేపలు, రొయ్యలు వలలకు చిక్కుతున్నాయి. మాంసాహార ప్రియుల నోరూరించే ఖరీదైన టైగర్ రొయ్యలతో పాటు వైట్ నార్న్, కలందస్, ఫ్రింఫ్ రొయ్యలు అధికంగా పడుతున్నాయి. చేపల్లో తెల్ల, నల్ల చందువాలు, వంజరం, కోణాలు, ట్యూనా చేపలు, కొమ్ము కోణం ఇలా అన్ని రకాల చేపలు పడడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ, రూరల్ ప్రాంతాల్లో ఎక్కువ మంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కాకినాడ దుమ్ములుపేట, పగడాలపేట, హార్బర్‌పేట, సూర్యారావుపేట, ఉప్పలంక, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో మత్స్యకారులు ఎక్కువగా ఉన్నారు. చిన్న చిన్న తెప్పల నుంచి మోటారు, మెకనైజ్డ్ బోట్లపై చేపల వేట సాగిస్తున్నారు. మెకనైజ్డ్ బోట్లపై మత్స్యకారులు సముద్రంలో సుదూర ప్రాంతాలకు వెళ్లి వలలతో వేటాడుతున్నారు. గత ఏడాది కంటే ఎక్కువ బోట్లపై చేపల వేట సాగించేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు.



కాకినాడ కుంభాభిషేకం రేవు వద్ద విక్రయాలకు సిద్ధంగా ఉంచిన కొమ్ము కోణం చేపలు



వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌లో చిక్కిన టైగర్ రొయ్యలు



చందువా చేపలు

నిషేధ భృతికి ఎదురుచూపులు

సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేట నిషేధ భృతిని అందించి ఆదుకుంటున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట మత్స్యకార కుటుంబాలకు రూ.10 వేల చొప్పున వేట నిషేధ భృతిని అందేది. ఏప్రిల్ నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల కారణంగా వేట నిషేధ భృతి అందించడంలో జాప్యం కావడంతో మత్స్యకారులు ఆ సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు.

అధికంగా చేపలు లభిస్తున్నాయి



మత్స్యకారులకు చేపల వేటే ఆధారం. జూన్ 15 నుంచి సముద్రంలో వేట నిషేధం అమలు జరిగింది. ఇటీవల అది ముగియడంతో వేటకు వెళ్తున్నాం. వలలకు అన్ని రకాల చేపలు చిక్కుతున్నాయి. దాదాపు పది నెలల పాటు వేట సాగిస్తాం. తుపాన్ల సమయంలో సముద్రంలోకి వెళ్లం. ఏ విధమైన ప్రమాదం లేకుండా చేపల వేట సాగాలని కోరుకుంటున్నాం.

– గరికిన జగన్నాథం, మత్స్యకారుడు, సూర్యారావుపేట

ఇతర ప్రాంతాలకు ఎగుమతి



చేపలకు మార్కెట్‌ను బట్టి గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం అరేబియా సముద్రం ప్రాంతంలో బ్యాన్ పిరియడ్ అమలు కావడవంతో ముంబయి, పూణే, కేరళ మార్కెట్‌లు బాగున్నాయి. మత్స్యకారులు వేటాడే చేపలకు మంచి ధర లభిస్తుంది. ప్రస్తుతం మార్కెట్ బాగుంది. ఈ విధంగా సాగితే మత్స్యకారులకు లాభాలు వస్తాయి.

– కోన చందు, వ్యాపారి, కాకినాడ

ఫోర్టిఫైడ్ బియ్యంతో రక్తహీనత దూరం



అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌సీఐ అధికారులు

కాకినాడ సిటీ: కొవ్వూరు తారకరామానగర్ 10వ వార్డులో రేషన్ దుకాణం వద్ద భారత ఆహార సంస్థ డివిజనల్ మేనేజర్ విమ్లాక్ష మున్సిలాల్ గౌతమ్ ఆధ్వర్యంలో బలవర్థకమైన బియ్యం (ఫోర్టిఫికేషన్)పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ రైస్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ఒక కిలో సాధారణ బియ్యంలో 10 గ్రాముల ఫోర్టిఫైడ్ రైస్ కలుపుతారన్నారు. ఈ ఫోర్టిఫైడ్ రైస్‌లో విటమిన్స్, ఐరన్, పోలిక్ యాసిడ్ మొదలైన సూక్ష్మ పోషకాలు ఉండడంతో రక్తహీనత, నాడి సంబంధిత వ్యాధులు దూరం అవుతాయని వివరించారు. ఎఫ్‌సీఐ అధికారులు ఎస్ఎమ్ అల్తాఫ్, హుస్సేన్, డిపో మేనేజర్లు ఎంవీఎల్ఎస్ ముత్యాలరావు, యల్లా శ్రీనివాస్, టెక్నికల్ సిబ్బంది, పాల్గొని లబ్ధిదారులకు బలవర్థకమైన బియ్యం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

29న జాతీయ లోక్ అదాలత్

కాకినాడ రూరల్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఈ నెల 29న జరుగుతుందని న్యాయవాది యనమల రామం అన్నారు. దీనిపై గురువారం స్థానిక సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసుల గురించి అవగాహన కల్పించారు. రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి ఇరువర్గాల కక్షిదారులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బుద్దరాజు సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాహితంగా రెవెన్యూ సేవలు



రమణయ్యపేటలో విశ్రాంత తహసీల్దార్ బాపిరాజుకు సత్కారం



కరపలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు

కాకినాడ రూరల్: ప్రజలకు మేలు జరిగేలా రెవెన్యూ శాఖ సేవలు ఉంటాయని విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు తెలిపారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాపిరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందు ఈస్ట్ ఇండియా కంపెనీ రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేసిందన్నారు. అప్పటి నుంచి రెవెన్యూ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, పార్థసారథి, రవిశంకర్ పట్నాయక్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరపలో రెవెన్యూ దినోత్సవం

కరప: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు మాట్లాడుతూ భూముల వ్యవహారాలు, భూ రెవెన్యూ, అత్యవసర కార్యనిర్వాహక మెజిస్టీరియల్ విధులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పర్యవేక్షణ, ఓటర్ల నమోదు, ఎన్నికల నిర్వహణ, సినిమాటోగ్రఫీ చట్టం, పౌరసరఫరాలు, ఇతర చట్టాలు రెవెన్యూ పరిధిలోకి వస్తాయన్నారు. ప్రోటోకాల్ అమలు, ప్రభుత్వం ఏమైన పథకాలు ప్రవేశపెట్టినప్పుడు వాటికి సంబంధించిన భూమి వ్యవహారాలు రెవెన్యూ శాఖ చూస్తుందన్నారు. తర్వాత కార్యాలయానికి వచ్చిన ప్రజలకు తహసీల్దార్ రామకోటేశ్వరరావు పలు అంశాలు వివరించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పులపకూర అప్పారావు, కాకినాడ ఈశ్వరరావులను సిబ్బందితో కలసి తహసీల్దార్ సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా

కాకినాడ సిటీ: కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ ఇట్ల కిశోర్ వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ, శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలసి సబ్ డిస్ట్రిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు వినియోగించకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు. డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 112 స్కానింగ్ సెంటర్లపై డెకాయి ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏప్రిల్, మే రెండు నెలలకు రెండు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 68 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రతి గ్రామస్థాయిలో వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. అదే విధంగా మత్స్యకార గ్రామాలు, స్లమ్ ఏరియాలపై దృష్టి పెట్టి, పాఠశాల విద్యార్థులకు, మహిళలకు బాల్య వివాహాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గ్రామ స్థాయిలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు సంయుక్తంగా గర్భిణుల గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించిన బోర్డులు, వాల్ పోస్టర్లు, ధరల పట్టిక, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800–425–3365ను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ కె.రత్నకుమార్, జీజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ హరిత, పిడియాట్రీషియన్ ఎం.కీర్తిప్రియా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి కె.సింహాద్రి, పిఠాపురం, తాళ్లరేవు, పెద్దాపురం సీడీపీఓలు, హెల్త్ ఎడ్యుకేటర్ పి.సత్యవతి, ఎల్.శృతి తదితరులు పాల్గొన్నారు.



డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కిశోర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య

కాకినాడ సిటీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నామని, మూడేళ్లు దాటిన చిన్నారులను చేర్పించాలని రూరల్ ఐడీసీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వై.లక్ష్మి కోరారు. గురువారం తూరంగి, కొవ్వూరుల్లో భేటీ బచావో, భేటీ పడావో, గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ప్రీ స్కూల్ విద్య, పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ఐదేళ్లు నిండిన తరువాత చిన్నారులను సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తామని సీడీపీఓ లక్ష్మి తెలిపారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సింహాచలం, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.



కొవ్వూరులో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రతి అడుగూ మడుగు నుంచే..

- అధికారులుండే చోట అవస్థలు
- మండల పరిషత్ కార్యాలయంలో పరిస్థితి ఇదీ

కరప: ప్రజలకు కష్టమొస్తే అధికారుల చుట్టూ తిరిగి పరిష్కరించాలని కోరుతుంటారు.. అదే అధికారులుండే చోటే అవస్థలమయంగా మారితే మరి ఎవరికి చెప్పుకోవాలో? ఇదంతా కరప మండల పరిషత్ కార్యాలయంలో పరిస్థితి. దీని పరిధిలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి మండలంలో ఉంటే కార్యాలయమే అనుకుంటే పొరపాటే.. దాదాపు ఏ మండల పరిషత్‌కు వెళ్లినా కార్యాలయం ఆకర్షణీయంగా ఉంటుంది. కరప మండల పరిషత్ కార్యాలయాన్ని చూస్తే మాత్రం అయ్య బాబోయ్ అనిపించక మానదు. చినుకు పడితే కార్యాలయం ఆవరణ బురదమయంగా మారుతోంది. కొంచెం ఎక్కువగా వర్షం పడితే, నీరెళ్లే మార్గం లేక మోకాలి లోతు ముంపు నీరు నిలబడిపోతుంది. కార్యాలయ సిబ్బంది, ప్రజలు ఇలా ఎవరైనా ఆ నీటిలోంచే ప్రతి అడుగు వేయాల్సిందే. రాకపోకలు సాగించేందుకు వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలకు మరీ ఇబ్బందికరంగా ఉంటోంది. వివిధ గ్రామాల నుంచి ఏదైనా పనిపై వచ్చేవారు నానా అవస్థలు పడుతున్నారు. కార్యాలయం ఆవరణలో నీరు నిలబడకుండా చేయలేని అధికారులు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక కార్యాలయం లోపలకు వెళితే శ్లాబ్‌ల పైనుంచి పెచ్చులూడి పడిపోతుంటే సిమెంట్ చేసి వదిలేశారు. కనీసం వైట్ వాస్ కూడా వేయించలేదు. ఏటా మండల పరిషత్ నిధులు రూ.లక్షలతో గ్రామాలను తీర్చిదిద్దుతున్నామని చెబుతున్న అధికారులు మాత్రం, తాముంటున్న కార్యాలయానికి రంగులు కూడా వేయించలేకపోతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయాన్ని తీర్చిదిద్ది, ఆవరణలో వర్షం నీరు నిలబడకుండా చూడాలని కోరుతున్నారు.



కొద్దిపాటి వర్షానికే ఆవరణ ఇలా..



కరప మండల పరిషత్ కార్యాలయంలో అధ్వానంగా శ్లాబ్

తవ్వేశారు.. తరలించేశారు



కరప సమీపంలో రాత్రికి రాత్రే మట్టిని తవ్వేసిన పుంత మార్గం ఇదే..

- యథేచ్ఛగా మట్టి మాఫియా

కరప: మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఇష్టానుసారంగా మట్టిని తవ్వేసి తరలించుకుపోతున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. పొలాల్లో మెరక, పల్లాలు తీస్తున్నామని చెప్పుకొంటూ మరి కొంతమంది ఇటుక బట్టీలకు మట్టిని అమ్మేసుకుంటారు. మట్టి తరలింపులతో రహదారులు అధ్వానంగా మారుతున్నాయని పాదచారులు అంటున్నారు. కరప నుంచి గొర్రిపాలెం, అరట్లకట్టకు వెళ్లే పుంత మార్గాన్ని బుధవారం రాత్రి తవ్వేసి, మట్టిని తరలించుకుపోయారు. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికరంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. యండమూరు, జి.భావారం, వడ్డిపాలెం తదితర గ్రామాల్లోని పొలాల్లో మట్టిని అడ్డగోలుగా తవ్వేసి, ఇటుక బట్టీలకు తరలించుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికసంఖ్యలో మట్టి ట్రాక్టర్లు తిరగడంతో యండమూరు– జి.భావారం రోడ్డుపై జిగురు మట్టి పేరుకుపోయింది. బుధ, గురువారాల్లో కురిసిన వర్షాలకు సదరు రోడ్డుతో బురదమయంగా మారింది. ద్విచక్ర వాహనచోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా మారిన యండమూరు– జి.భావారం రోడ్డు

టెక్నికల్ అసిస్టెంట్లకు పని కల్పించాలి

బోట్‌క్లబ్: రైతు భరోసా కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్లకు ఏడాదిలో 11 నెలలు పని కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ నివాస్‌కు వినతి పత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లకు కేవలం సంవత్సరంలో రెండు మూడు నెలలు మాత్రమే పని కల్పించిందన్నారు. దీంతో వారు సంవత్సరంలో 9 నుంచి 10 నెలలు పనిలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ తప్పును సరిదిద్ది సంవత్సరంలో 11 నెలలు పని కల్పించాలన్నారు.

డ్రైనేజీలపై శాశ్వత కట్టడాలా?

- సత్వరమే తొలగించండి
- కమిషనర్ వెంకటరావు ఆదేశం

కాకినాడ: డ్రైనేజీలను ఆక్రమించి వాటిపై శాశ్వత కట్టడాలు నిర్మిస్తే ఎలా.. దీనివల్ల పారిశుధ్య నిర్వహణకు ఆటంకం కలుగుతోంది.. వెంటనే వీటిని స్వచ్ఛందంగా తొలగించాలని కాకినాడ నగర పాలకసంస్థ కమిషనర్ జె.వెంకటరావు కొంతమంది వ్యాపారులకు సూచించారు. తక్షణమే డ్రైనేజీలను ఆక్రమించి వేసిన స్లాబ్‌లను తొలగించాలని ఆదేశించారు. గురువారం ఆయన కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైతు బజార్‌ను సందర్శించారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుబజార్‌లో రోజువారీ ఉత్పత్తి అయ్యే కూరగాయల వ్యర్థాల తరలింపుతో పాటు, ఇతర సమస్యలపై ఆయన ఆరా తీశారు. అదే ప్రాంగణంలో డ్రైనేజీలను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న తీరును గుర్తించారు. వెంటనే వాటిని తొలగించాలన్నారు. అలాగే స్థానిక సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు శుక్రవారం సాయంత్రం రైతుబజార్ వ్యాపారులు, ఇతర అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ చెప్పారు. మార్కెటింగ్ శాఖకు చెందిన అధికారులు, ఎస్టేట్ అధికారి ఆయన వెంట ఉన్నారు. అనంతరం 9వ సర్కిల్‌లో, సాంబమూర్తి నగర్ ప్రాంతాల్లో కాలువల పూడికతీత పనులను కమిషనర్ పర్యవేక్షించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పూడికతీత పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏ ఒక్క ప్రాంతంలోనూ వర్షపు నిలిచిపోకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.




డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు

కార్యదర్శుల పనితీరుపై మండిపాటు

- 11 మందికి షోకాజ్ నోటీసులు

కాకినాడ: విధి నిర్వహణలో సచివాలయ కార్యదర్శుల అలసత్వంపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మండిపడ్డారు. బాధ్యతా రహితంగా పని చేస్తున్నారన్న అభియోగంపై 11 మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. గురువారం కాకినాడ గాంధీనగర్ 41వ డివిజన్ ఏ–బీ సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో అడ్మిన్లు, వివిధ విభాగాల సచివాలయ కార్యదర్శుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెస్ కోడ్ ఉల్లంఘించడం, సమయపాలన పాటించకపోవడం, రికార్డుల నిర్వహణలో అలసత్వాన్ని గుర్తించారు. అక్కడ ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. అనేక లోపాలు బయటపడటంతో కమిషనర్ వెంకటరావు మండిపడ్డారు. ఇందుకు బాధ్యులైన ఆ రెండు సచివాలయాలకు చెందిన 11 మందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు దగ్గరగా మెరుగైన సేవలు అందించాల్సిన సచివాలయ కార్యదర్శులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని మిగిలిన సచివాలయాలను కూడా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎటువంటి లోపాలు కనిపించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు